

తల్లికి వందనం పథకం కింద ఖాతాల్లో జమవుతున్న నిధుల సందేశాలు చూసి తల్లులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల చదువుల ఖర్చులకు భరోసా కల్పిస్తూ ఇచ్చిన హామీని నిలబెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 24.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 93 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## పెట్టుబడుల జెట్ స్పీడ్..!

- రూ.29.30లక్షలకోట్లతో 1,037పరిశ్రమలు
- 24.66లక్షల ఉద్యోగాల దిశగాగ్రౌండింగ్ వేగవంతం..
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'పై లోకేష్ ఫోకస్



**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.29,30,357 కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు ముందుకు వచ్చాయి. వీటిద్వారా 24,66,165 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం మంత్రి లోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరిగింది. సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... మిగతా 2లో...

## ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

- ట్యాంపర్‌ప్రూఫ్ బ్లాక్‌చెయిన్ వ్యవస్థతో భూ రికార్డుల భద్రత
- డబుల్ రిజిస్ట్రేషన్లకు చెక్..
- భూ వివాదాల నివారణే లక్ష్యం
- పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు



**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రక్షాళన-విముక్తి-భద్రత అంశాలుగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును తెచ్చామని సీఎం చంద్రబాబు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకతలను సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూ శాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా... ప్రతీ ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడీ ఇచ్చి ట్యాంపర్-ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని... ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మిగతా 2లో...

### టెక్నాలజీతోనే సమర్ధ పోలీసింగ్

భవిష్యత్ సవాళ్లకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉండాలి

'ఫ్యూచర్ పోలీసింగ్' సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

2 లో

### అమరావతికి క్వాంటం ఫైనాన్స్ హబ్

పీఎన్‌బీ-ఏపీ ప్రభుత్వం మధ్య ఎంఓయూ

బ్యాంకింగ్ సైబర్ భద్రత, డిజిటల్ ఫైనాన్స్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం

## భరోసా పెన్షన్లు ముందస్తుగా



- ఆరు జిల్లాల్లో జూలై 30నే పంపిణీ
- రూ.514.42 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, మిగతా 3లో...

## మంగళగిరిలో ఉద్యోగుల మహాసభ

- పాత పెన్షన్ సౌకర్యం కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతా సభలు
- 26న మంగళగిరిలో రాష్ట్రస్థాయి రెండో మహాసభ..
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భారీగా తరలిరానున్న ఉద్యోగులు



**మంగళగిరి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు జీఓ ఎంఎస్-53 ద్వారా పాత పెన్షన్ సౌకర్యాన్ని కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయం వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత, భరోసాను కల్పించిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.
ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్‌కు, కూటమి బాగస్వామ్య పక్షమైన బీజేపీకి, కృతజ్ఞతలు మిగతా 2లో...

## స్మగ్లింగ్‌పై జీరో టాలరెన్స్

- ఎర్రచందనం అక్రమ రవాణా నిర్మూలనకు కఠిన చర్యలు
- కింగ్‌పిన్లు, అక్రమ నిల్వలపై ఉక్కుపాదం మోపాలని పవన్ కల్యాణ్



**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు అటవీ శాఖ మరింత దూకుడుగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాలతో పాటు వాటి వెనుక ఉన్న కింగ్‌పిన్లు, ఫైనాన్షియర్లపై కూడా ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. డ్రోన్లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిఘాను మరింత పటిష్టం చేయాలని సూచించారు.
గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, గత రెండేళ్లలో చేపట్టిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి సంబంధించి తీసుకున్న చర్యలు, నమోదైన కేసులు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం వివరాలను సమర్పించారు. మిగతా 2లో...

## 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

- చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం
- 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి
- ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకం అమలు
- 50 ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్లు అందజేస్తున్నాం

3 లో



## తెలుగు తేజానికి మహోత్సవం

- 25, 26న ఉండవల్లి గుహల్లో తెలుగు మహోత్సవం
- తెలుగు భాషాభిమానులకు మంత్రి కందుల దుర్గేష్ ఆహ్వానం

**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళా వైభవాన్ని భావితరాలకు చేరవేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలుగు మహోత్సవం ప్రతి తెలుగు హృదయాన్ని కలిపే సాంస్కృతిక ఉత్సవంగా మిగతా 2లో...



## పెండింగ్ కేసులపై ప్రభుత్వం ఫోకస్



- ప్రత్యేక కమిటీలు.. నోడల్ అధికారులు.. ఆన్‌లైన్ పోర్టల్‌కు రూపకల్పన
- ఏపీ పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రివర్గ ఉపసంఘం కీలక నిర్ణయాలు

**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) అమలు, విధివిధానాల ఖరారు కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం గురువారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మిగతా 3లో...

## భోగాపురంపై ఫుల్ ఫోకస్

- ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రుల సంఘం సమీక్ష
- భద్రత నుంచి రవాణా వరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచన

**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ఆగష్టు 1వ తేదీన రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రుల సంఘం అధికారులను ఆదేశించింది. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల సంఘం అధికారులతో సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాట్ల గురించి తీసుకుంటున్న -2లో...





## డ్రోన్ సిటీకి భారీ పెట్టుబడి


- కర్నూలులో రూ.400 కోట్లతో డ్రోన్ క్లస్టర్ ప్రతిపాదన
- ఏవియేషన్ శిక్షణ కేంద్రానికి మరో రూ.100 కోట్ల పెట్టుబడి

**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడటంతో ఏవియేషన్, డ్రోన్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయంలో నాట్స్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్, మిగతా 2లో...

### రూ.641 కోట్లతో నెరడి బ్యారేజీ పూర్తికి

## కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- ఉత్తరాంధ్ర సాగునీటి స్వప్నం సాకారం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి
- దశాబ్దాల వంశధార చిక్కుముడులు విప్పి చారిత్రాత్మక గెజిట్ సాధన
- రెండేళ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి..
- ఏడాదిలోగా 106 ఎకరాల భూమిని సేకరించి ఇవ్వనున్న ఒడిశా ప్రభుత్వం



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాను దశాబ్దాలుగా వేధిస్తున్న వంశధార నీటి వివాదానికి స్వస్తి పలుకుతూ నేరడి బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 641 కోట్లు మంజూరు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర గెజిట్ సాధించడంలోనూ, సరదాగా నిధులు మంజూరు చేయించడంలో -3లో...

# పెట్టుబడుల జెట్ స్పీడ్..!



(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షలో పురోగతి కన్పించాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలు ఏపీని ఎంచుకోవడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్ లో విశాఖపట్నంలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ లో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధనం అవసరం, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. నిర్ణీత సమయంలో గ్రౌండ్ చేసిన ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించేలా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఇ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# స్మగ్లింగ్‌పై జీరో టాలరెన్స్

(మొదటి పేజీ తరువాయి)

**రెండేళ్లలో 506 కేసులు.. 1,239 మంది అరెస్టు:** గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై 506కేసులు నమోదు చేసి, 1,239మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. 372 వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని గుర్తించి, ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో కన్విక్షన్ రేటు 3 శాతం కంటే తక్కువగా ఉండేదని, ప్రస్తుతం 95 శాతం కేసుల్లో నిందితులకు శిక్షలు పడే స్థాయికి దర్యాప్తు, అభియోగాల నమోదు మెరుగుపడిందని అధికారులు తెలిపారు.

**కింగ్‌పిన్లపై ప్రత్యేక దృష్టి :** సమీక్ష సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఎర్రచందనం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన అటవీ సంపద అని, దానిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోందని, క్షేత్రస్థాయిలో అదే కఠినంగా అమలు కావాలని ఆదేశించారు.

దేశంలోని ఏ రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ నిల్వలు గుర్తించినా అక్కడి పోలీసు, అటవీ శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్‌పిన్లు, ఫైనాన్షియర్లు, అక్రమ రవాణాకు సహకరిస్తున్న వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**డ్రోన్లతో నిఘా.. అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యం :** రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను రక్షించేందుకు డ్రోన్లు, ఆధునిక నిఘా వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని ఆయన ఆదేశించారు.

# భోగాపురంపై ఫుల్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

చర్యలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బహిరంగ సభా ప్రాంగణం, వేదిక, భద్రత, వివిధ గ్యాలరీలు, గ్రీన్ రూమ్స్, జనసమీకరణ, పార్కింగ్, రవాణా, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రుల సంఘం పలు సూచనలు చేసింది. ప్రధాని మోదీ రాక నేపథ్యంలో విద్యార్థులతో పెద్దఎత్తున థింసా నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. అరకు కాఫీ విశిష్టతను తెలిపేలా స్టాల్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. అన్ని శాఖల సమన్వయంతో అల్లూరి సీతారామరాజు విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రుల సంఘం అధికారులను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ప్రధానమంత్రి పర్యటన నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర ప్రగతికి 'భోగాపురం' బాట!



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ, ప్రాంతీయ అభివృద్ధికి నూతన బలాన్ని ఇచ్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు)ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వైభవంగా ప్రారంభం కానుండటం ఉత్తరాంధ్ర చరిత్రలోనే ఒక స్వర్ణాక్షర ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిరంతర కృషి ఫలితంగానే ఈ చారిత్రక ప్రాజెక్టు కల రూపుదిద్దుకుందని ఆయన కొనియాడారు.

గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని, భారీగా పెట్టుబడులు తరలిరావడంతో పాటు ఐటీ, పర్యాటక, పారిశ్రామిక, సేవా రంగాలు శరవేగంగా విస్తరించి వేలాదిమంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. పోర్టులు, జాతీయ రహదారులకు తోడు భోగాపురం ఎయిర్‌పోర్టు జతకూడటంతో ఉత్తరాంధ్ర దేశంలోనే వేగవంతమైన అభివృద్ధి ప్రాంతంగా అవతరిస్తుందన్నారు. ఇది కేవలం ఎయిర్‌పోర్టు ప్రారంభం మాత్రమే కాదని, ప్రజల ఆశయాలు నెరవేరిన మహత్తర విజయమని పేర్కొంటూ.. ఈ పండుగ వాతావరణాన్ని ఉత్తరాంధ్రులందరూ గర్వంగా స్వాగతించాలని పిలుపునిచ్చారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)



మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని... రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. చీ×జ ఆంధ్రప్రదేశ్, చీ×జ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లెన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీ-సర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. మీ భూమి-బ్లాక్ చెయిన్ అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్ ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.


**అధ్యయనం చేయాలి... లోపాలు సరిదిద్దాలి :** మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపీలోనూ భూ తగాదాలు... వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది.

భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి.

దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మీ భూమి-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది."అని ముఖ్యమంత్రి చెప్పారు. మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీఎస్ సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఏపీ-ఎన్ఐసీ, బెంగళూరు-ఎన్ఐసీ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# టెక్నాలజీతోనే సమర్థ పోలీసింగ్



**విజయవాడ, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ ప్రజలకు కనిపించే విధంగా సమర్థవంతమైన పోలీసింగ్‌ను అమలు చేయాలని ఆయన సూచించారు. విజయవాడలో నిర్వహించిన ఏపీ పోలీస్ రిట్రీట్--2026 'ఫ్యూచర్ పోలీసింగ్' కాన్ఫరెన్స్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరై పోలీసు ఉన్నతాధికారులను ఉద్దేశించి ప్రసంగించారు.

రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులు పాల్గొని భవిష్యత్ పోలీసింగ్, సైబర్ నేరాల నియంత్రణ, మహిళలపై నేరాల నివారణ, సాంకేతికత వినియోగం, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై రూపొందించిన ప్రజెంటేషన్లను ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, 2001లో ఇదే తరహాలో ఫ్యూచర్ పోలీసింగ్ వర్క్‌షాప్ నిర్వహించామని, అప్పటితో పోలిస్తే నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయిందన్నారు. సోషల్ మీడియాను ఉపయోగించి సమాజంలో అశాంతిని రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖ సాంకేతికంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు.

నేరాలను అరికట్టడమే కాకుండా, నేరస్థులకు వేగంగా శిక్షలు పడేలా దర్యాప్తు వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. పోలీస్ వ్యవస్థలో "ఇన్విజిబుల్ పోలీస్--విజిబుల్ పోలీసింగ్" విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, టెక్నాలజీ వినియోగంతో తక్కువ సిబ్బందితోనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అన్నారు.

తిరుమల మెట్ల మార్గంలో అపహరణకు గురైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ సమయంలో గుర్తించగలిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇటువంటి సంఘటనల్లో వేగంగా స్పందించకపోతే ప్రజల్లో అపోహలు ఏర్పడి ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేసేందుకు కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని, పాస్టర్ ప్రవీణ్ ఘటనలో జరిగిన తప్పుడు ప్రచారాన్ని ఖండించడానికి కూడా కొంత సమయం పట్టిందని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు వేగంగా చేరవేయడంలో పోలీస్ వ్యవస్థ మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు.

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ ఇంకా కట్టుదిట్టమైన చర్యలు అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం కుటుంబాలను నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ, వాటి దుష్పరిణామాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు.

డాగ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ విభాగాలను మరింత ఆధునీకరించాలని, రౌడీయిజం, ఫ్యాక్షనిజం నియంత్రణలో పోలీస్ శాఖ సాధించిన విజయాలను కొనసాగించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూనే నేరస్థుల పట్ల కఠినంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా పోలీసులు

# అమరావతికి క్వాంటం ఫైనాన్స్ హబ్




**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి క్వాంటం వ్యాలీలో మరో కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందుకు వచ్చింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ లో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఏపీ క్వాంటం మిషన్-పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు- పీఎన్ బీ సీఈఓ, ఎండీ అశోక్ చంద్ర సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మొట్ట మొదటి బ్యాంక్ గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది. బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను పటిష్టం చేయటంతో పాటు ఆర్థిక మోసాలను ముందుగా గుర్తించే వ్యవస్థ ఏర్పాటు, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్ని సురక్షితంగా నిర్వహించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్ లు, పరిశోధనా సంస్థలతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఒకే వేదికపైకి తెచ్చేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ పని చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించేలా ఈ హబ్ పని చేయనుంది.

**డిజిటల్ లిటరసీపై ప్రత్యేక కార్యాచరణ :** అమరావతిని క్వాంటం సహా డీప్ టెక్నాలజీలకు కేంద్రంగా మార్చాలని సంకల్పించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏక్యూవీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్వాంటం ఏఐ ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయటం మరో కీలకమైన మైలు రాయి అవుతుందని సీఎం అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే వినియోగదారులతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ పెంచే దిశగా కృషి చేయాలని ముఖ్యమంత్రి పీఎన్ బీ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వాలు- బ్యాంకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయటంలో టెక్నాలజీ మరింత విస్తృతమవ్వాలని సీఎం సూచించారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు భద్రతను అత్యుత్తమ స్థాయిలో అందించాలని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ ను మరింత పటిష్టంగా, సులభతరంగా సేవలు అందించేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ ఎండీ అశోక్ చంద్ర ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ బీ ఉన్నతాధికారులు, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు.

# మంగళగిరిలో ఉద్యోగుల మహాసభ

(మొదటి పేజీ తరువాయి)



తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో కృతజ్ఞతా సభలు నిర్వహించాలని లబ్ధిదారులైన ప్రభుత్వ ఉద్యోగులు నిర్ణయించారు. ఉద్యోగులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇటువంటి సభలు నిర్వహించడం ప్రభుత్వంపై వారికి ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే తొలి కృతజ్ఞతా సభ విశాఖపట్నంలో వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రెండో కృతజ్ఞతా సభను రాజధాని ప్రాంతమైన మంగళగిరిలో ఈ నెల 26వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీకే కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఈ సభ విజయవంతం చేసేందుకు లబ్ధిదారులైన ఉద్యోగులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జీఓ ఎంఎస్-53 ద్వారా పాత పెన్షన్ ప్రయోజనం పొందుతున్న ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న సానుకూల నిర్ణయాలకు ప్రతిస్పందనగా కృతజ్ఞతా సభలు నిర్వహించడం మంచి సంప్రదాయంగా నిలుస్తుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం-ఉద్యోగుల మధ్య పరస్పర విశ్వాసం, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపేతమవుతుందని, భవిష్యత్తులో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# తెలుగు తేజానికి మహోత్సవం




(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జులై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వినితో కలిసి తెలుగు మహోత్సవం అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, జానపద వారసత్వం, కళా సంప్రదాయాలు, సృజనాత్మకతలను ఒకే వేదికపై ఆవిష్కరించే అరుదైన కార్యక్రమమే తెలుగు మహోత్సవమని పేర్కొన్నారు. మాతృభాషలోని మాధుర్యాన్ని విద్యార్థులు, యువత ఆస్వాదించేలా చేయడంతో పాటు, నిత్య జీవితంలో తెలుగు వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఆధునిక జీవనశైలిలో తెలుగు భాష వినియోగం తగ్గుతున్న నేపథ్యంలో మాతృభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ మహోత్సవం దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు రచించిన "దేశభాషలందు తెలుగు లెస్స" అనే ప్రసిద్ధ పద్యాన్ని ఆలపించి, దాని భావాన్ని వివరించారు.

మాతృభాష పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని, తెలుగు భాషాభిమానులు, విద్యార్థులు, కళాకారులు, సాహితీవేత్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలుగు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని పాల్గొన్నారు.

# డ్రోన్ సిటీకి భారీ పెట్టుబడి



(మొదటి పేజీ తరువాయి)

జీజీఎఫ్ ఆస్ట్రా ఎనలిటికా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు మంత్రిని కలిసి తమ పెట్టుబడి ప్రతిపాదనలను వివరించారు.

నాట్స్ ఏరోస్పేస్ ప్రతినిధి అధిరాజ్ సింగ్ చావ్లా నాగార్జునసాగర్ లేదా కర్నూలు విమానాశ్రయంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వచ్చే ఐదేళ్లలో సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి, 100 మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రారంభంలో ఆరు శిక్షణ విమానాలతో కార్యకలాపాలు ప్రారంభించి, ఐదేళ్లలో వాటి సంఖ్యను 20కు పెంచనున్నట్లు వెల్లడించారు. మరోవైపు జీజీఎఫ్ ఆస్ట్రా ఎనలిటికా సంస్థ కర్నూలు డ్రోన్ సిటీలో రూ.400 కోట్ల పెట్టుబడితో 100 ఎకరాల్లో డ్రోన్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. డ్రోన్ పరిశోధన, తయారీ, అసెంబ్లింగ్, టెస్టింగ్, శిక్షణ, ఇంక్యుబేషన్ సేవలను అందించడంతో పాటు 2027 గోదావరి పుష్కరాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం డ్రోన్ సేవలు అందించేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది.

పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదికలతో ముందుకు వస్తే ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఏవియేషన్, డ్రోన్ రంగాల్లో ఇలాంటి పెట్టుబడులు రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. జీజీఎఫ్ ఆస్ట్రా ఎనలిటికా ప్రతిపాదించిన డ్రోన్ సేవలపై సెప్టెంబర్‌లో ట్రయల్ రన్స్ నిర్వహించి, ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

# రూ.641 కోట్లతో నెరడి బ్యారేజీ పూర్తికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)



నూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసాధారణ చొరవ ప్రదర్శించారు. జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టు సాధనకై ఆయన తొలినుంచి నిరంతర పట్టుదలతో కృషి చేశారు. నాటి సుప్రీంకోర్టు ఉత్తర్వులు, ట్రిబ్యునల్ వివాదాల నుంచి ప్రాజెక్టును గట్టెక్కించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించిన అచ్చెన్నాయుడు, లీగల్ పోరాటంలో రాష్ట్ర వాదనలు ట్రిబ్యునల్‌లో బలంగా వినిపించేలా చేసి చారిత్రాత్మక తీర్పు రావడంలో ప్రధాన భూమిక పోషించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార దశ–II పూర్తిపై ప్రత్యేక దృష్టోత్సాహంతో వ్యవహరించిన మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి సూచనలు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెచ్చారు. ఈ సుదీర్ఘ ప్రయత్నాల ఫలితంగానే కేంద్ర జలశక్తి శాఖ ట్రిబ్యునల్ తీర్పును అధికారికంగా గెజిట్‌లో ప్రచురిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనివల్ల ఒడిశా భూభాగంలోని 106 ఎకరాల సేకరణకు మార్గం సుగమం కావడమే కాకుండా, బ్యారేజీ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి హక్కులు లభించాయి. ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యంతో పెండింగ్‌లో పడిన ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించి గెజిట్ సాధించడం అచ్చెన్నాయుడు రాజకీయ రాజనీతికి, ప్రాంతీయ అభివృద్ధి పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. కేంద్ర గెజిట్ విడుదలైన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా కేబినెట్ భేటీలో రూ. 641 కోట్లను మంజూరు చేయించడం ద్వారా అచ్చెన్నాయుడు తన కార్యాచరణ వేగాన్ని నిరూపించుకున్నారు. రాబోయే రెండేళ్ల వ్యవధిలోనే నెరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి వెనుకబడిన, కరువు పీడిత ప్రాంతాల రైతులకు నీళ్లందిస్తామని ప్రకటించి జిల్లా ప్రజల దశాబ్దాల కలను సాకారం చేశారు. చట్టపరమైన చిక్కులను అధిగమించి, నిధులు రాబట్టి, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా అచ్చెన్నాయుడు తీసుకుంటున్న చర్యలపై జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# భరోసా పెన్షన్లు ముందస్తుగా

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం వెల్లడించారు.

మంత్రి తెలిపిన వివరాల ప్రకారం, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జూలై 30నే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేపట్టనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 11,98,044 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 514.42 కోట్ల పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

పెన్షన్ల పంపిణీకి అవసరమైన నగదు ఉపసంహరణ ప్రక్రియను ఈ నెల 29వ తేదీకే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే, పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రధానమంత్రి పర్యటన, విమానాశ్రయం ప్రారంభోత్సవం నేపథ్యంలో కూడా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఒక రోజు ముందుగానే పెన్షన్లు అందజేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర పెన్షన్ లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందుతుందని ఆయన తెలిపారు.

# ప్రధాని మోదీ పర్యటన విజయవంతంపై రాష్ట్ర బీజేపీ ప్రత్యేక దృష్టి



- భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి విస్తృత ఏర్పాట్లు
- ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**భోగాపురం, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లు, ప్రారంభోత్సవ వేదిక, ప్రజల కోసం చేపడుతున్న సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ఆగస్టు 1న ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర చరిత్రలో ఒక చారిత్రక ఘట్టంగా నిలిచేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

విమానాశ్రయం ప్రవేశద్వారం వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. విమానాశ్రయంలో ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ, ప్రాంతీయ జానపద కళారూపాలు, శిల్పాలు, ప్రతిమలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీంతో విమానాశ్రయానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులకు ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవం పరిచయం అవుతుందని పేర్కొన్నారు.

అదేవిధంగా ఉత్తరాంధ్రకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన అరకు కాఫీ స్టాల్స్‌ను కూడా విమానాశ్రయంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రాంతీయ కళాకారులు, హస్తకళలకు ప్రోత్సాహం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రజలను భాగస్వామ్యం చేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రధాని మోదీ పాల్గొనే సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి, పర్యాటక రంగానికి, పారిశ్రామిక పెట్టుబడులకు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు కొత్త దిశను చూపుతుందని ఆయన పేర్కొన్నారు.

# ‘నేతన్న సేవ’తో ఆర్థిక దన్ను



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా నేతన్న సేవ పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ. 25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం బడ్జెట్ లో రూ. 250 కోట్లు కేటాయించామని, వచ్చే నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్రం చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రసచివాలయంలోని తన ఛాంబర్ లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పిందన్నారు. నేతన్న సేవ పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఈ మేరకు కేబినెట్ లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం నాడు నేతన్న సేవ పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఏటా 51,952 మంది నేతన్నలకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేయనున్నామన్నారు. చేనేతలకు ఆర్థిక దన్ను కలిగించేలా నేతన్న సేవ పథకాన్ని శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

**నేతన్న కుటుంబానికి భారీ ఆర్థిక లబ్ధి :** 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ. 4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. 51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ. 720లు, ఏడాదికి రూ. 8,640లు, మర మగ్గం నేతన్నలకు నెలకు రూ. 1800 చొప్పున ఏడాదికి రూ. 21,600లు లబ్ధి కలుగుతోందన్నారు. మగ్గం నేతన్నలకు నేతన్న సేవ రూ. 25 వేలు, పెన్షన్ రూ. 48 వేల చొప్పున రూ. 48 వేలు, ఉచిత్ విద్యుత్ తో రూ. 8,640లు మొత్తం ఏడాదికి రూ. 81,640లు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. మర మగ్గం నేతన్నలకు నేతన్న సేవ పథకం కింద రూ. 25 వేలు, పెన్షన్ రూపంలో రూ. 48 వేలు, ఉచిత విద్యుత్ కింద రూ. 21,600లు కలిపి మొత్తం రూ. 94,000 లబ్ధి కలుగుతోందన్నారు.

**చంద్రబాబు పాలన నేతన్నలకు స్వర్ణయుగమే... :** కూటమి ప్రభుత్వం రాగానే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టెక్స్ టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు గౌరవప్రద జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఏటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ. 5 కోట్లు మంజూరు చేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామని తెలిపారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని, ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టీటీడీతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి సవిత కొనియాడారు.

**26న రాష్ట్ర పండుగగా ప్రగడ కోటయ్య జయంతి :** ఈ నెల 26న చేనేత సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామని మంత్రి సవిత తెలిపారు. చీరాలలో ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతిని జరపనున్నట్లు వెల్లడించారు.

**జగన్ కు నిరూపణ చేతకాదు :** జగన్‌కు ఆరోపణలు చేయడమే తప్ప నిరూపించడం చేతకాదని, కూటమి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయడమే ఆయన లక్ష్యమని మంత్రి సవిత విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని జగన్ నెరవేర్చలేదన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు, డీఎస్సీ నిర్వహణ, సంపూర్ణ మద్యపాన నిషేధం, ఇద్దరు బిడ్డలకు అమ్మఒడి అని హామీలిచ్చి... ఏ హామీని కూడా ఆయన నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డికి మాట్లాడే నైతిక హక్కే లేదన్నారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు తన మొదటి సంతకం మెగా డీఎస్సీ నిర్వహణ ఫైల్ సంతకం చేసి, తనమాట నిలబెట్టుకున్నారన్నారు. గతంలోనూ సీఎం చంద్రబాబు ఎంతో పారదర్శకతతో డీఎస్సీలు నిర్వహించారని గుర్తుచేశారు. గతేడాది మెగా డీఎస్సీని కూడా అవకతవకలకు తావులేకుండా పూర్తి చేశారని మంత్రి సవిత కొనియాడారు.

# వానలపై ఎల్‌నినో నీడ

- సాగునీటి ఎద్దడికి ముందస్తు కార్యాచరణపై ప్రభుత్వం దృష్టి
- ఆరుతడి పంటలు, విత్తన కిట్లతో రైతులకు అండ



**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్ నినో ప్రభావం ఈ ఏడాది అధికంగా ఉంటుంది కావున రైతుల శ్రేయస్సు దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో మంత్రులు,అధికారులు సమన్వయంతో సమస్య నుండి రైతులు గట్టెక్కే విధానాలపై కసరత్తు చేస్తున్నామని రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 1390 వ (53వ) క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు. క్యాబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సమస్యలపై దిశానిర్ధేశం చేశారని ముఖ్యంగా ఎల్ నినో ప్రభావంతో రైతులు సాంప్రదాయ పంటలు వేయటం వల్ల సకాలంలో సాగు నీరు అందక పోతే నష్టపోతారన్న అభిప్రాయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తం చేశారని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉండనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు. ఈ ఏడాది సాధారణం కంటే 51 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గుదల ఉంటుందని,దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కోనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొనే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గుచూపాలని తద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచన ను రైతులు చేయవద్దని కోరారు. దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు.

పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందని దీంతో గోదావరి,కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఒక వేళ మంచి వర్షాలు పడితే మంచిదే కాని ఎల్ నినో ప్రభావం పై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్పటికే 70 శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. రైతులకు ప్రభుత్వం,వ్యవసాయ శాఖలు అండగా ఉంటాయని,రైతులు కూడా ప్రభుత్వం అందించే సూచనలు,సలహాలు పాటించాలని కోరారు. రైతులను ఆదుకోవడానికి వివిధ రకాల విత్తనాల కిట్లను అందించడానికి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని,ఎల్ నినో ప్రభావం నుండి బయట పడాలని రైతులకు సూచించారు. తాగునీటి సరఫరాకు ట్యాంకర్ల వినియోగంపై కూడా ప్రభుత్వం సమాలోచన చేస్తుందన్నారు. అలాగే పశుగ్రాసం కొరత రాకుండా మెట్ట పంటల సాగు ఆలోచన చేయలని కోరారు. మన రాష్ట్రంలో 59 శాతం ఆయకట్టు భూమి,41 శాతం వర్షాధార పంట భూములు ఉన్నాయని,ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. అందుకు అవసరమైన విత్తనాల కిట్లను కూడా వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తుందన్నారు.


నదుల అనుసంధానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో సారి ఉద్ఘాటించారని మంత్రి పార్థసారథి తెలిపారు. ఎల్ నినో ప్రభావాలను తగ్గించడానికి జల వనరులను రెగ్యులైజ్ చేయాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రతిపాదించడం జరిగిందన్నారు. గోదావరి నది, కావేరి నదులు వయా బనకచర్ల అనుసంధానం వల్ల మూడు రాష్ట్రాలకు అధిక ప్రయోజనం కలుగుతుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం ఎంతో ఉపయుక్తమైనదన్నారు. కర్ణాటక,తమిళనాడు రిజీయన్ లో ఘర్షణ వాతావరణం సైతం తగ్గటమే కాకుండా తమిళనాడు తాగు నీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉండటం హర్షనీయమన్నారు. నదుల అనుసంధానం తెలంగాణా,ఏపి,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉంటుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రాల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ గా నిలవనుందని, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానాశ్రయాన్ని ప్రారంభించ నున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు.

ఈసమావేశంలో రాష్ట్రసమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కెఎస్. విశ్వనాథన్ పాల్గొన్నారు.

# క్వాంటం పరిశోధనలకు అమరావతి అత్యుత్తమ ప్రదేశం





- సీఎం చంద్రబాబుతో క్వాంటినమ్ టెక్నాలజీస్ సీఈఓ రాజీబ్ హజ్రా భేటీ

**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ టెక్నాలజీగా క్వాంటం కంప్యూటింగ్ రంగాన్ని గుర్తించి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పని చేయటం ప్రారంభిస్తుందని.. ఇప్పటికే క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు ఏపీలో పని ప్రారంభించాయని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి ఫుల్ స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ కంపెనీ క్వాంటినమ్ సంస్థ సీఈఓ రాజీబ్ హజ్రా సహా ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి క్వాంటం వ్యాలీని క్వాంటం ఇన్నోవేషన్ సహా పరిశోధనలు తదితర అంశాల్లో కీలకమైన హబ్ గా తయారు చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో క్వాంటినమ్ సంస్థ సీఈఓ చర్చించారు. జాతీయ క్వాంటం మిషన్ కు అనుగుణంగా ప్రపంచస్థాయి ఎకోసిస్టంను అభివృద్ధి చేసేందుకు ఏపీతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు క్వాంటినమ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాలు, ఏఐ ఎనేబుల్డ్ క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ రీసెర్చి, స్టార్టప్ ఇంక్యుబేషన్ టెక్నాలజీల పై పనిచేయాలని సీఎం సూచించారు. గతంలో ఐటీని ప్రోత్సహించామని ఇప్పుడు ఏఐ, క్వాంటం టెక్నాలజీల ద్వారా వేగంగా సమస్యలకు పరిష్కారం అందించాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. క్వాంటం పరిశోధనలకు ఏపీ అమరావతి అత్యుత్తమ ప్రాంతమని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తితో పాటు అల్గారిథమ్స్ వరకూ సహకారం అందించేందుకు తాము సిద్ధమని క్వాంటినమ్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

# పెండింగ్ కేసులపై ప్రభుత్వం ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. లిటిగేషన్ పాలసీపై గతంలో నిర్వహించిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశా లలో సమీక్షించి, చేసిన సూచనల మేరకు న్యాయ శాఖకు చెందిన అధికారులు ఇతర రాష్ట్రాల్లో అమలుకు సంబంధించిన విధానాలను ఉప సంఘం దృష్టికి తీసుకువెళ్లారు.

**పర్యవేక్షణ కమిటీలు, నోడల్ అధికారులు, ఆన్ లైన్ పోర్టల్ ఏర్పాటు :** గుజరాత్ రాష్ట్రంలో పర్యటించి అక్కడ అమలవుతున్న పబ్లిక్ లిటిగేషన్ పాలసీ కి సంబంధించిన పూర్తి వివరాలను మంత్రుల బృందానికి న్యాయశాఖ సెక్రటరీ ప్రతిభా దేవి వివరించి నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ కోర్ట్ కేసుల పరిష్కారం పై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాకుండా, అమలు కోసం ప్రత్యేకంగా పర్యవేక్షణ కమిటీలు, నోడల్ అధికారులు,ఆన్ లైన్ పోర్టల్ ఏర్పాటుకు సంబంధించి దృష్టి సారించాలని న్యాయశాఖ అధికారులకు సూచించారు. న్యాయ శాఖలో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార ఫోరంలు ఏర్పాటు చేయడం, పారదర్శకత, జవాబుదారీతనంకు అనుగుణంగా “ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం”ను రూపొందిస్తామని అన్నారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అవసరమైన అప్పీళ్లను సకాలంలో దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి, సకాలంలో కోర్టు ఉత్తర్వులు అమలుచేసి కంటెంప్ట్ కేసులు తగ్గించేందుకు చర్యలను కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాన్ని ప్రోత్సహించడం, సమీక్షించడం, లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం, జీపీ, ఏజీపీ, పీపీ, ఏపీపీ లలో జవాబుదారీతనం పెంచడం, తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల వారీగా, ఏ శాఖలో ఎక్కువ పెండింగ్ కేసులు ఉన్నాయి, ఏ శాఖలో తక్కువ కేసులు ఉన్నాయో చూసుకొని, ఆయా శాఖల మధ్య సమన్వయం చేసుకోవడంతోపాటు, పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీ వేస్తామన్నారు.

ప్రతి ప్రభుత్వ శాఖకు ఒక లైజనింగ్ ఆఫీసర్, పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించడం ద్వారా ప్రభుత్వ శాఖల్లో న్యాయపరమైన అంశాలను త్వరితగతిన పరిష్కారం చేసేలా విధి విధానాలు ఖరారు చేసి లిటిగేషన్ పాలసీని తయారు చేయాలని న్యాయధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి, మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో మంత్రులు ఫరూక్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ లు సూచించారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**ఆత్మకూర్ ఎస్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కురామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మండలాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. మండలంలోని కందగట్ల, నెమ్మికల్, ఏనుభాముల, ఇస్తాళాపురం, ముక్కుడు దేవులపల్లి, నసీంపేట, దాచారం, పాత సూర్యాపేట గ్రామాల్లో పర్యటించిన కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాల్లోని కార్యకర్తలకు ఎస్., ఐ. ఆర్ పై పలు సూచనలు చేశారు. అర్హుడైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటును నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత గ్రామంలోని నాయకులపై ఉందని తెలిపారు. అదేవిధంగా బిఎల్ఓ లు కూడా ఓటర్ లిస్ట్ ఆధారంగా ఏ ఒక్క పౌరుడు కూడా తన ఓటు హక్కు నష్టపోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి భూతం లింగయ్య యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి తన్నీరు పురుషోత్తం, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శిగ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మూల ఎల్లయ్య, జామండ్ల సత్యనారాయణ రెడ్డి, గుండాల శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రామగిరి గాంధీ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో శాంతియుత ధర్నా



**నల్లగొండ, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ రాజధాని న్యూఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత మాట్లాడుతూ, నీట్ పరీక్ష ల లీకేజీపై ప్రధాని స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడొద్దని హెచ్చరిస్తూ, పరీక్షల లీకేజీలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం సరికాదని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, యువత, రైతుల పక్షాన కాంగ్రెస్ నిలుస్తుందని పేర్కొంటూ, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## నెమ్మికల్ లోని చౌడ చెరువు కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



**ఆత్మకూర్ ఎస్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో గల చౌడ చెరువును కొందరు కబ్జాదారులు ఆక్రమించుకున్నారని బుధవారం తహసీల్దార్ కు స్థానిక మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత్స్యకార సొసైటీ సంఘం అధ్యక్షులు జంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చౌడ చెరువును కొందరు అక్రమంగా కబ్జా చేసి బోర్ వేశారని అదేవిధంగా కొంత భాగాన్ని సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చెరువులో వేసిన బోరును సీజ్ చేసి, ఆ భూమిని కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. ఈ చౌడ చెరువు పై ఆధారపడి 70 మత్స్యకార కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని వారి పొట్టకొట్టవద్దని తహసీల్దర్ ను వేడుకున్నారు. చెరువు కబ్జా చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి కబ్జాకోరాల నుంచి చెరువుని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులు గంగారబోయిన శ్రీను, సారగండ్ల వెంకట్, బిజిగ ఈశ్వర్, నార్ల వేణు, ప్రశాంత్, బిజిగ గణేష్, హరీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం..



**వలిగొండ, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని నివాసం ముట్టడి కార్యక్రమానికి నిరసనగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామ చందర్ రావు చలో గాంధీ భవన్ పిలుపుతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు గాంధీభవన్ కి వెళ్ళకుండా పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా శాఖ పిలుపు మేరకు , మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ , ఈ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాము పాలిస్తున్న రాష్ట్రాలలో అనుసరిస్తున్న విధానాలను, ఆ పార్టీ సిద్ధాంతాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని, ఆ పార్టీకి దేశంలో పుట్టగతులు లేవని గమనించి, అనేక దేశ విచ్ఛిన్నకర శక్తుల రూపంలో విధ్వంసాలు సృష్టిస్తుంటే ఆ పార్టీ వ్యతిరేకించేది పోయి వారికి కొమ్ముగాస్తుండడం చాలా సిగ్గుచేటని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ,కనతాల అశోక్ రెడ్డి, బచ్చు శ్రీనివాస్, బిజెపి మండల నాయకులు మందుల నాగరాజు, గంగాధరి దయాకర్, బుంగమట్ల మహేష్, పెద్ద కిట్టు, మైసొల్ల చిన్న మచ్చ గిరి, కీర్తి వెంకటేశం, దయ్యాల వెంకటేశం, పల్లెర్ల నరసింహ, కొత్త రామచంద్రం, జనార్దన్ రెడ్డి, పాండు, జంగయ్య, లింగస్వామి, సైదుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సమీక్ష సమావేశం..



**వలిగొండ, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వి బి జి ఆర్ ఏ ఏఎం జి , డ్రెయిన్ సోక్ పిట్స్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో చర్చించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, పురోగతి నివేదికలను అత్యవసర ప్రాధాన్యతతో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత , ఏఈ పీఆర్ జి. సందీప్ రెడ్డి , ఏఈ ఆర్.డబ్లు.యస్. కీర్తి , ఈజీఎస్ ఈసీ బీపీ విక్రమ్ , ఏఈ హౌసింగ్ కిరణ్ , మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ అగ్ర నేతల అరెస్టుకు నిరసనగా చలో లోక్ భవన్..

– పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.






**యాదాద్రి భువనగిరి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ ప్రియాంక గాంధీల అప్రజాస్వామ్య అరెస్టుకు నిరసనగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని లోక్ భవన్ వద్ద నిర్వహించిన 'చలో లోక్ భవన్' కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు , ప్రశ్నా పత్రాల లీక్ వ్యవహారం పై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా ఖండిస్తూ , కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని , రాజ్యాంగ విలువలను పరి రక్షించడం ప్రతి ప్రజా స్వామ్య వాదిపై ఉన్న బాధ్యతని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల గొంతుకను అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ సహించ దని , ప్రజాస్వామ్య పరి రక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొన సాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం పంజా గుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నిరసన కార్యక్రమంలో పాల్గొని పోలీసులు అదుపులోకి తీసుకున్న మంత్రి వివేక్ వెంకట స్వామి , తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ని కలిసి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగు తుందని పేర్కొన్నారు.

# చందంపేట పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ బుధవారం దేవరకొండ సబ్‌డివిజన్ పరిధిలోని చందంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ రికార్డులు, కేసులపై క్షుణ్ణ పరిశీలన ఈ సందర్భంగా ఎస్పీ గారు పోలీస్ స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు విధానం, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, ఆయుధాల సంరక్షణ, సీసీటీఎన్ఎస్ నమోదులు, డిజిటల్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, పోలీస్ కిట్ల వినియోగం తదితర అంశాలను పరిశీలించారు. శాంతి భద్రతలు, నేరాల నియంత్రణపై దిశానిర్దేశం అనంతరం పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల అమలుపై ఎస్పీ కీలక సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే స్వీకరించి చట్టబద్ధంగా పరిష్కరించాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. VPO వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి గ్రామస్థులతో మరింత సమన్వయంతో పనిచేసేలా విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వూపా) వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, వ్యాపార ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పెంచి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గస్తీ, నిఘా వ్యవస్థ పటిష్ఠం చేయాలని ఆదేశాలు రాత్రి గస్తీని మరింత పటిష్ఠం చేయడం, బీట్ అధికారుల పనితీ రును పర్యవేక్షిం చడం, పెండింగ్ వారెంట్లను వేగంగా అమలు చేయడం, రౌడీషీటర్లు మరి యు అనుమానితుల కదలికలపై నిఘాకొన సాగించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. పాల్గొన్న అధికారులు ఈ కార్యక్రమంలో దేవ రకొండ డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఎస్‌బీ సీఐ నాగరాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, డిండి సీఐ బిసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుంతలతో గడ్డిపల్లి ప్రధాన రహదారి గండం

- లోడు ట్రాక్టర్ గుంతలో కూరుకుపోవడంతో స్తంభించిన ట్రాఫిక్
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- మంత్రి వస్తేనే తాత్కాలిక మరమ్మత్తులు.. మిగతా రోజుల్లో గుంతల రహదారే





**గరిడేపల్లి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** గరిడేపల్లి–సూర్యాపేట ప్రధాన రహదారి గడ్డిపల్లి గ్రామం మెయిన్ సెంటర్లో ఏర్పడిన భారీ గుంతలు వాహనదారులకు శాపంగా మారాయి. రహదారి పూర్తిగా దెబ్బతినడంతో నిత్యం వందలాది వాహనాలు ఇబ్బందులు పడుతున్నాయి. గుంతల కారణంగా ఇప్పటికే పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ మాత్రం శాశ్వత మరమ్మతులపై దృష్టి సారించకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం గడ్డిపల్లి గ్రామం వద్ద భారీ గుంతలో లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ కూరుకుపోవడంతో కొంతసేపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రహదారికి ఇరువైపులా వాహనాలు బారులుగా నిలిచి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రయాణికులు, అత్యవసర సేవల వాహనాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఈ రహదారి దుస్థితిపై గతంలో పలుమార్లు దినపత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ అధికారులు స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మంత్రి పర్యటన ఉంటేనే రోడ్డు గుర్తొస్తుందా మంత్రి పర్యటనలు ఉన్నప్పుడు మాత్రమే గుంతల్లో కంకర పోసి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని, పర్యటన ముగిసిన తర్వాత మళ్లీ రహదారిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రతిరోజూ ఈ రహదారిపై ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాల కారణంగా గుంతలు మరింత ప్రమాదకరంగా మారాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గడ్డిపల్లి గ్రామం సమీపంలోని దెబ్బతిన్న రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## తల్లి జన్మనిస్తుంది.. హెల్మెట్ పునర్జన్మనిస్తుంది

- బెల్టు రక్షణ..యమ ధర్మరాజు శిక్షణ.
- జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత అవగాహన సదస్సులు.



**యాదాద్రి భువనగిరి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిదిలో రోడ్డు భద్రత అవగాహన కార్య క్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమాల్లో పోలీసులు, వాహన దారులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లు, వ్యాపారులు, ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకోవాలిని, మద్యం సేవించి వాహనాలు నడప కూడదని , డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని అతివేగాన్ని నివారించాలని, ట్రాఫిక్ నియమాలు, సిగ్నల్లను తప్పని సరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి పౌరుడి బాధ్యత ఎంతో కీలక మని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని పలువురికి పోలీసులు అవగాహన కల్పించారు. ప్రజలందరూ బాధ్యతా యుతమైన రహదారి వినియోగదారులుగా వ్యవహరిస్తూ, రోడ్డు భద్రతకు సహకరించాలని అవగాహన కార్యక్రమ వివరాలను తమ కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులకు, బంధుమిత్రుల వరకు విస్తరించాలని యాదాద్రి భువనగిరి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## నీట్ పేపర్ లీకేజీపై ఆత్మకూరులో యూత్ కాంగ్రెస్ ధర్నా

- కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి



**ఆత్మకూరు, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** నీట్ పేపర్ లీకేజీ ఘటనపై ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆత్మకూరు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కూడా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిత్తర్ల అనిల్, ఎన్ఎస్‌యూఐ మండల శాఖ అధ్యక్షుడు యాస సుభాష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి తొండల అనిల్ కుమార్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భాషబోయిన నవీన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ ఎలగందుల మహేష్, టౌన్ యూత్ కాంగ్రెస్ నాయకుడు గుండెగాని కిరణ్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు లోడి మహేష్, యూత్ కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షుడు యాస మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలపై వ్యవసాయ అధికారుల ఆకస్మిక తనిఖీలు

– ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు.. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన



**మిర్యాలగూడ, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ మండలంలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి వళ్ళోజు వినోద్ కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు కొనిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌డీసీఎంఎస్ మిర్యాలగూడ, కేకే ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, ఈ–పాస్ యంత్రాల ద్వారా జరిగిన ఎరువుల విక్రయాల వివరాలు, గోదాముల్లోని నిల్వలు, కొనుగోలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయిస్తున్నారా ఆధార్ ఆధారిత ఈ–పాస్ యంత్రాల ద్వారానే రైతులకు ఎరువులు అందిస్తున్నారా? అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా కల్తీ ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ఎరువుల ప్యాకెట్లపై ఉన్న వివరాలు, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. అనంతరం రైతులతో సమావేశమైన అధికారులు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భవిష్యత్‌లో సాగునీటి లభ్యత తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం సాగు విస్తీర్ణంలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రైతులు కంది, పెసర, మినుము, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, ఇతర చిరుధాన్యాలు వంటి తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. పంటల ఎంపికలో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులు ఎరువులను కేవలం అధీకృత దుకాణాల నుంచే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఎరువుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలు, అధిక ధరల వసూళ్లు లేదా నాణ్యత లోపాలు గుర్తించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి యం. ఋషేంద్రమని, రమేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) నాగయ్య, మురళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం మహాభాగ్యం - ప్రభుత్వ వైద్యమే ప్రజలకు మహా వరం

## తక్షణ స్పందన - ఒక కుటుంబానికి అండగా నిలిచిన

**వనపర్తి ,జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలం, అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన మేకల జ్యోతి భర్త వసంత్ కుమార్ తీవ్రమైన కిడ్నీ సంబంధిత వ్యాధితో చాలా కాలంగా బాధపడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి చికిత్సకు అనుకూలంగా లేక తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో మేకల జ్యోతి భర్త వసంత కుమార్ కుటుంబ సభ్యులు చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూరు గ్రామానికి చెందిన బెక్కెం వేణుగోపాల్ రెడ్డిని సంప్రదించారు. తక్షణమే స్పందించి సమాచారం అందుకున్న వెంటనే బెక్కెం వేణుగోపాల్ రెడ్డి నిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతితో నేరుగా మాట్లాడి రోగికి అత్యవసర వైద్య చికిత్స అందేలా చర్యలు చేపట్టారు. కేవలం సిఫారసుతో ఆగిపోకుండా, చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3 లక్షల (ఎల్ ఓ సి) మంజూరు కు కిడ్నీ వ్యాధి చికిత్స అత్యంత ఖర్చుతో కూడుకున్నదని గుర్తించిన బెక్కెం వేణుగోపాల్ రెడ్డి వెంటనే ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి సంప్రదించారు. వారి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ ) ద్వారా రూ.3 లక్షల ఎల్ ఓ సి, మంజూరై, రోగికి చికిత్సకు మార్గం సుగమమైంది.ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ఒక నిరాశలో ఉన్న కుటుంబానికి కొత్త ఆశను, కొత్త జీవితాన్ని అందించిన మానవతా స్పందన. మేకల జ్యోతి భర్త వసంత కుమార్ వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రజా సమస్యలపై ప్రజా అవసరాలపై ఆపద్బాంధవుడుగా నిలుస్తున్న బెక్కెం వేణుగోపాల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వారి దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా ఎవరి సమస్యనైనా తన సమస్యగా భావించి తన భుజస్కందాలపై వేసుకొని సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం కృషి చేస్తూ వారి సమస్యలను నెరవేరుస్తున్న ప్రజా



నాయకుడు మన బేక్కెం వేణుగోపాల్ రెడ్డికి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి వారి అవసరాలను నెరవేరుస్తూ వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల్లో మనలను పొందుతున్న బెక్కెం వేణుగోపాల్ రెడ్డి, కొల్లాపూర్ నియోజక వర్గ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదు

## -షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**




ఢిల్లీలో నీట్ పరీక్ష వివాదం, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీఛార్జికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన ధర్నాలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పరీక్షలు రాస్తున్నారని, అలాంటి పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకుంటే వారి జీవితాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలపై ప్రశాంతంగా నిరసన వ్యక్తం చేస్తే వారిపై లాఠీఛార్జీ చేయడం, పోలీసుల బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వీర్లపల్లి శంకర్ అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై అణచివేత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు.ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాయడానికి ఎవరూ ప్రయత్నించకూడదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.నీట్ పరీక్షపై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. దేశ యువతకు అండగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, విద్యార్థుల హక్కుల కోసం అవసరమైతే మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆయన తెలిపారు.

# విద్యార్థులను మభ్యపెడుతున్న లెక్చరర్స్

**ఖమ్మం, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఢడిగ్రీ కళాశాలలో దోస్త్ చివరి ఫేస్ లో స్వచ్ఛందంగా మంచి కళాశాల అని ఎంచుకొని దానితోపాటు కోర్సులు కూడా నిర్ణయించుకొని వస్తే అక్కడ లెక్చరర్ కొందరు విద్యార్థులు చేరే కోర్సులు కాక ఆ లెక్చరకు సంబంధించిన కోర్సుల్లో జాయిన్ చేసే పరిస్థితి ఏర్పడుతుంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మంచి కోర్సులో వద్దామని వస్తే వాళ్ల టార్గెట్ల కోసం వాళ్ళ సబ్జెక్టులలో చేర్పించేందుకు ఉత్సాహపడుతున్నారు. కళాశాలలో చేరే విద్యార్థులను మభ్యపెడుతున్నారు. దీనిపట్ల కొందరు విద్యార్థులు తీవ్ర అరోపణలు చేస్తున్నారు. ఇలా చేర్పిస్తే రానున్న కాలంలో నా కళాశాలకు వేరే వారి సంఖ్య ఎక్కువ గా ఉండే ప్రమాదం ఉంటుందని కొందరు ఆరోపిస్తున్నారు. ఏ విద్యార్థి అయితే తాను చేరే కోర్సులో జాయిన్ అయ్యేవిధంగా చూడాలి తప్ప. లెక్చరర్ల సోలాభం కోసం విద్యార్థులను బలి చేయకూడదని ఆరోపిస్తున్నారు. కళాశాలలో లెక్చరర్ల మధ్య నెలకొన్న పోటీ తత్వం కూడా ప్రధాన కారణం అని నేటి శుభోదయం కు విన్నవించుకున్నారు.

# విద్యుత్ రంగంలో మౌలిక వసతుల విస్తరణకు శ్రీకారం చుట్టిన భట్టి విక్రమార్క

## -పలుప్రారంభోత్సవాలు,శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు,ఎమ్మెల్యేలు

**వరంగల్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**



తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను విస్తరిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండలో రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ,మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం విద్యుత్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి కాలనీ, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, విద్యుత్ నగర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, హనుమకొండ నూతన సర్కిల్ కార్యాలయ భవనం, టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఐదో అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ ఉపకేంద్రాన్ని, కార్పొరేట్ కార్యాలయంలో అత్యాధునిక సమావేశ మందిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణను విద్యుత్ రంగంలో దేశానికి ఆదర్శరాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను ఆధునిక పరుస్తూ ప్రజలకు నిరంతరాయంగా"నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. పరిశ్రమలు, వాణిజ్య రంగం, గృహ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం టీజీఎన్‌పీడీస◌ీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ల నిర్మాణం, మౌలిక వసతుల విస్తరణ, వినియోగదారుల సేవల మెరుగుదల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడంతో పాటు విద్యుత్ రంగాన్ని మరింత ఆధునికీకరించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, జిల్లా అటవీ అధికారి నిఖిల, టీజీఎనప◌ీడీసీఎల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు."

# ప్రతి బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం.. గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలి

## -వైద్యాధికారి జవహర్ లాల్



**వికారాబాద్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యాధికారి జవహర్ లాల్ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్నచిన్న కంటి సమస్యల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి అధికంగా ఖర్చు చేయకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కంటి చూపు మందగించడం, కంటి నొప్పి, నీరు కారడం, మసకగా కనిపించడం వంటి సమస్యలతో బాధపడుతున్న వారు వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవడం ద్వారా కంటి సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చని తెలిపారు. మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వైద్య సిబ్బంది కోరారు.

# గోశాలలో గోమాతల మరణ ఘోష

## -చౌడమ్మా గుట్ట ఆంజనేయస్వామి దేవాలయ గోశాలలో ఘోరం

**షాద్‌నగర్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రపంచంలో మరే జంతువుకూ లేని చాలా ప్రత్యేకతలు గోవుకుంది.అందుకే హిందువులు తమ తల్లి తర్వాత తల్లి స్థానాన్ని ఇచ్చి " గోమాత " అని గౌరవంగా పిలుస్తూ పూజిస్తారు.. గోమాత అంటే భారతదేశంలోని ఎంత గౌరవం దక్కుతుందో వేరేగా చెప్పనక్కర్లేదు.. అలాంటి గోమాతలకు దక్కిన గోస మరణ ఘోష చూస్తే నిర్వాహకుల తీరుకు అద్దం పడుతుంది. రెండు ఆవులు చనిపోయినా నిర్వాహకులు అటువైపు కన్నీటి కూడా చూడలేదు. రెండు గోమాతల కళేబరాల అక్కడే పడి ఉన్నప్పటికీ పక్కనే మరికొన్ని ఆవులు గడ్డిమేస్తున్నాయి. పాపం నోరులేని జంతువుల అరణ్య రోదన లాగే మిగిలింది. ఆ ఆంజనేయస్వామి సాక్షిగా గోమాతల మృతి ఘోష పై ఓ భక్తుడు ఆవేదన వ్యక్తం చేస్తూ మీడియాకు సమాచారం అందించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ శివారులోని చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ గోశాలలో ఘోరం జరిగింది. రెండు పశువుల కళేబరాలు గోశాలలో గడ్డి కింద ఉన్నాయి. అవి ఎప్పుడు మరణించాయో కూడా తెలియదు నిర్వాహకులు అటువైపు కన్నీటి కూడా చూడనట్టు ఉన్నారు. ఓ భక్తుడు స్వామివారిని దర్శించి గోమాతల వద్దకు ప్రసాదం పెట్టడానికి వెళ్లి ఈ ఘోరం కళ్ళారా చూసి సదరు దృశ్యాలను హలో షాద్ నగర్ మీడియాకు పంపించారు. నిర్వాహకుల పనితీరును ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు గోదానం చేసిన లేక ఎవరైనా రైతులు గోమాతలను పోషించుకోలేక వాటిని అమ్మలేక పోతే వాటిని తెచ్చి ఇలా దేవాలయాల్లో గోశాలలో అప్పజెప్తారు. లేదా గుడ్డు మాంసం కోసం తరలిస్తుంటే వాటిని పట్టుకొని కూడా భక్తులు ఇక్కడ పెడతారు. అలాంటి పశువుల పాలనా పాలన చూసుకోవాల్సిన నిర్వాహకులు అటువైపు గడివేసి కన్నెత్తి కూడా చూడకుండా ఉంటే వాటి పరిస్థితి మృతి ఘోష ఎవరికి వినిపిస్తుంది ఎవరికి కనిపిస్తుంది. సాక్షాత్తు నిర్వాహకులే ఈ సమాధానం చెప్పాలి. గోశాల నిర్వహణకు ఎంతోమంది భక్తులు చందాలు విరాళాలు ఇస్తుంటారు మరి కొంతమంది గడ్డిని కూడా వాటికి సమకూర్చుతూ ఉంటారు. అయితే అక్కడ కేవలం నిర్వహణ మాత్రమే చూసుకోవాలి. ఇలా అతిగా తీలేని నిర్వహణ పెట్టుకొని పశువులు మరణిస్తుంటే ఏం చేస్తున్నారో వారికే తెలియాలి. నీ విచక్షణ...నీ చదువు... నీ సంస్కారం... నీ విజ్ఞత... నిజాన్ని నిజాయితీగా స్వీకరించే వ్యక్తిత్వం నీలో ఉంటే... గోమాత బాగోగులు చూసుకోరా..? హిందూ ధార్మిక సంఘాలు ఇలాంటి అన్యాయాలపై గోరాలపై స్పందించాలి నిర్వాహకుల తీరును ప్రశ్నించాలి ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడాలి..

# ఎన్ ఐఆర్ డిపి ఆర్ ను అవార్డింగ్ బాడీగా గుర్తించిన ఎన్సివిఈటి.



**రాజేంద్రనగర్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

జాతీయ నైపుణ్య అభివృద్ధి,వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎన్ సివిఈటి) హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్ డిపిఆర్) ను 'అవార్డింగ్ బాడీ'(ద్వంద్వ గుర్తింపు )గా అధికారికంగా గుర్తించింది.ఈ మేరకు జూలై 21న ఢిల్లీలో ఒక ఒప్పందం పై సంతకం చేశాయి.గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖల కోసం వృత్తి,నైపుణ్య కోర్సుల విభాగాలలో ఎన్సివిఈటి ఆమోదిత కోర్సులను ప్రారంభించాలని ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ ప్రణాళిక చేసింది.నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి,ఎన్ సి విఈటి కార్యనిర్వాహక సభ్యులు నిరంజన్ కుమార్ సుదాన్సు అధ్యక్షతన ఈ ఒప్పంద సంతకాలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ఎన్సివిఈటి గుర్తింపు విభాగం డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ విక్రమ్ సింగ్ భాటి,పర్యవేక్షణ విభాగం డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ సౌరబ్ ఎస్.బిష్ట్,దూరవిద్య కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిష్ సత్య పాలన్,రిసోర్సెస్ శిక్షణ అభివృద్ధి విభాగం డైరెక్టర్ డాక్టర్ సంధ్యా గోపకుమారన్ హాజరయ్యారు.

## నాలుగు గదుల్లో రెండు స్కూల్స్ ఎలా నడుపుతారు

**: సిపిఎం నేత పోతినేని సుదర్శన్**





**ఖమ్మం, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఖమ్మం నగరంలో ముగ్గురు మంత్రులకు సకల సౌకర్యాలతో హెడ్ క్వార్టర్స్ వున్నాయని కానీ దేశ భవిష్యత్తు నిర్ణయించే విద్యార్థులకు చదువు కోవడానికి స్కూల్ బిల్డింగ్ లు లేవని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మండిపడ్డారు. పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యలను పార్టీ బృందం పరిశీలన చేసింది. మొదటి వికలాంగుల కాలనీ రజకవీధి లోని శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను పరిశీలన చేశారు.అనంతరం రమణగుట్ట లోని నాలుగు గదుల పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ రజక వీధిలోని పాఠశాల పూర్తిగా శిధిలావస్థలో వుండటం ఫలితంగా ఇక్కడ ఈ స్కూల్ చదువుతున్న 60 మంది విద్యార్థులు రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న రమణగుట్ట నాలుగు గదుల స్కూల్ లో ప్రస్తుతం విద్యాభ్యాసం చేస్తున్నారు అని తెలిపారు. రజక వీధిలోని పాఠశాలకు నిధులు కేటాయించి స్కూల్ ప్రారంభం చేయాలని ఈ ప్రాంత వాసులు పలుసార్లు సంవత్సరాల తరబడి మంత్రులకు, కలెక్టర్ లకు, డిఈఓ లకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకుండా పోయింది అని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రజక వీధిలోని పాఠశాలకు నిధులు కేటాయించి స్కూల్ ప్రారంభం చేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో డిఈఓ ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. మరోవైపు రమణగుట్ట స్కూల్ లో కేవలం నాలుగు గదులు మాత్రమే వున్నాయి అని ఇక్కడ దాదాపు 160 మంది విద్యార్థులు చదువుతున్నారు అని ఇక్కడ స్కూల్ లో వారికి సరిపడా సౌకర్యాలు లేవనీ ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీ శ్రీ విగ్రహం నుంచి బైపాస్ రోడ్ నుండి మున్నీరు వరుకు రైట్ సైడ్ ప్రాంతంలో కేవలం ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలు వున్నాయి అని హైస్కూల్ లేదు అని వెంటనే ఈ ప్రాంతంలో హై స్కూల్ ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.దేశ భవిష్యత్తును విద్యా, వైద్యం మాత్రమే నిర్దేశం చేస్తుంది అని అటువంటి ముఖ్యమైన విద్యా రంగానికి తగిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం లేదు అని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతిలో విద్యా శాఖ వుంది అని కానీ విద్యా అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు అని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో వున్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు యర్రా శ్రీనువాసురావు, మెరుగు సత్యనారాయణ, ఎం ఏ జబ్బర్, నందిపాటి మనోహర్, దొంగల తిరుపతిరావు, పి రమ్య, బోడపట్ల సుదర్శన్, ఎస్ కే నాగులు మీరా, ఉపేంద్ర , వజేనేపల్లి శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, యు ఆర్ యస్, యస్ యస్ ఏ ఉపాధ్యాయ, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి : టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్



**ఖమ్మం, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

కేజీబీవీ, యు ఆర్ ఎస్,ఎస్ఎస్ఎలలో పనిచేసే కాంట్రాక్టు ఉపాధ్యాయ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా ఈ సంస్థల్లో పనిచేస్తున్న వారి యొక్క కష్టాలు వర్ణాతీతం, తక్కువ వేతనాలతో 24 గంటలు విధుల్లోనే గడపవలసిన పరిస్థితిలో కనీస రక్షణ కూడా లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తుందని వారి గోడును అర్థం చేసుకొని వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కేజీబీవీ, యుఆర్ఎస్, ఎస్ ఎస్ ఏ ఉద్యోగ, అవకాశాలు ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కొణిజర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కి పోస్ట్ కార్డు ద్వారా వారి యొక్క ఆందోళనను తెలియజేశారు. అలాగే అనాధ, పాక్షిక అనాధ, బాలికలకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి పట్ల మీరు మానవత్వంతో ఆలోచించి న్యాయం చేస్తారని ఆశతో విధి లేని పరిస్థితుల్లో ఈ పోస్ట్ కార్డు ఉత్తరం ద్వారా వారి బాధలను తెలంగాణ ముఖ్యమంత్రి కి తెలియజేశారు. కావున సానుకూల దృష్టితో పరిశీలించి వారి యొక్క డిమాండ్ ను పరిష్కరించాలని కోరుతున్నాం. మినిమం టైం స్కేల్ వర్తింప చేయాలనీ, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలనీ, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు కల్పించాలనీ, వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలనీ, హెల్త్ కార్డులు మంజూరు చేయాలనీ, 29 రోజుల సమ్మె కాలపు వేతనం చెల్లించాలనీ,ఉద్యోగులందరికీ వారి స్థాయిని భట్టి క్యాడర్ డిసైడ్ చేయాలని ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ కొణిజర్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి వీరస్వామి, మాదాల ప్రసాద్, జిల్లా మండల నాయకులు అజ్మీర నాగేశ్వరరావు, శాంతయ్య, కేజీబీవీ సిబ్బంది ఎస్ ఓ డి సౌజన్య, సమతా, సునీత, షాహిన్, కమల కుమారి, జ్యోతి, రమాదేవి, సుమతీ, తదితరులు పాల్గొన్నారు.

## అపోలో డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు

**సంగారెడ్డి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

సదాశివపేట, సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీ, గణేష్ కట్ట సమీపంలో ప్రజలకు నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నొస్టిక్ సెంటర్ను సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఆధునిక వైద్య పరీక్షలు స్థానికంగానే అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని, ఇలాంటి డయాగ్నొస్టిక్ సెంటర్లు ప్రజలకు సమయం, ఖర్చు ఆదా చేయడంతో పాటు మెరుగైన ఆరోగ్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కేంద్రం ద్వారా సదాశివపేటతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో




సెంటర్ ప్రొప్రైటర్లు మహమ్మద్ యూనుస్, మహమ్మద్ యూసుఫ్, వీరేష్, సంగమేష్, నూతన్, ఫెరోజ్, రజినీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.ఎం.ఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, తాలెల్మ రాము, సోమ శంకర్, గుణాకర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బోనకల్ ప్రభుత్వ ఆసుపత్రి, బాలికల విద్యాలయాల్లో సమస్యలపై ప్రజా సంఘాల క్షేత్రస్థాయి పరిశీలన

**బోనకల్, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్) :**

బోనకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు ఆయా సంస్థలను సందర్శించి అధికారులు, సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకుడు చింతలచెరువు కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుభ్రత కార్మికుని ఉద్యోగం ఖాళీగా ఉండటంతో పరిశుభ్రత నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మూడు సంవత్సరాలుగా వేతనాలు చెల్లించకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు.వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ, రెండు సహాయక నర్సు ఉద్యోగాలు ఖాళీగా ఉండటంతో పాటు రోగులకు అవసరమైన పరుపులు, దిండ్లు తగినంతగా లేవని వివరించారు.సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బంధం శ్రీనివాసరావు, బంధం రాజ్యం, మహిళా సంఘం నాయకురాలు జొన్నలగడ్డ సునీత, సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అత్యవసర వైద్యం కోసం ఖమ్మం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నందున బోనకల్ ప్రభుత్వ వైద్యశాలను ఇరవై నాలుగు గంటల వైద్య సేవలు అందించే స్థాయికి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. విద్యాలయ ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయితో మాట్లాడి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వసతి గృహంలో మంచాలు, పరుపులు లేక విద్యార్థినులు



నేలపైనే నిద్రిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసిన నాయకులు, వెంటనే అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ పరిశీలనలో గోవిందపురం సర్పంచ్ మంద కరుణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తెల్లాకుల శ్రీనివాసరావు, పెద్దప్రోలు రామారావు, ఉప్పర శ్రీను, బిల్లా విశ్వనాథం, నారపోగు జాన్ సైమన్, గద్దె రామారావు, చేపూరి వెంకటేశ్వర్లు, కొమ్మినేని పురుషోత్తం, పెద్దప్రోలు కోటేశ్వరరావు, ఏసుపోగు బాబు, తిరుపతమ్మ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్రం

**ఏన్కూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నీట్ పోటీ పరీక్షల లీకేజ్ లతో దేశంలోనే నిరుద్యోగల విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటమాడుతుందని ఏన్కూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఏన్కూరు మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు .ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.... నిరుద్యోగల,విద్యార్థుల పక్షాన మాట్లాడితే అక్రమ అరెస్టులు చేస్తారా అంటూ ప్రశ్నించారు. లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమంగా అరెస్టు చేశారని , బిజెపి ప్రభుత్వం పతనానికి నిదర్శనమని పలువురు నాయకులు అన్నారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని కోరడం తప్ప అంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పై బల ప్రయోగం చేసి గాయపరచటం అత్యంత ధారుణమని అన్నారు. జంతర్ మంతర్ విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేసి పైశాచిక ఆనందాన్ని కేంద్ర ప్రభుత్వం పొందుతుందని , లీకేజీ వ్యవహారంపై , విద్యార్థులపై లాఠీ ఛార్జ్ వ్యవహారంపై, రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుకు వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఉద్యోగాలు అడిగితే లాఠీ చార్జ్ చేస్తారాని పలువురు నాయకులు ధ్వజ



మెత్తారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని ఆ హక్కును అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చి రామ్ నాయక్, మేడ ధర్మారావు, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు, జిల్లా సెక్రెటరీ కొప్పుల ప్రభావతి రెడ్డి, సామిల్, ఓబీసీ మండల అధ్యక్షుడు మొగిలి నాగరాజు,వేముల కృష్ణ ప్రసాద్, చందూలాల్, ముక్తి వెంకటేశ్వర్లు, మాలోత్ నరసింహారావు,పూర్ణ కంటి మైసరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, గుర్రం రవి, నల్లమల శివకుమార్, మజీద్ ఖాన్, పంతగాని నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

**: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం 2026 జూలై 15 నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటివరకు అమలులో ఉన్న ఫ్రైట్ ఆన్ లారీ (ఎఫ్ ఓఎల్ ) సౌకర్యాన్ని నిలిపివేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ గిడ్డంగులు లేదా రేక్ హెడ్‌ల నుంచి సరఫరా అయ్యే ఎరువులకు సంబంధించిన రవాణా ఛార్జీలను మాత్రమే రైతుల నుంచి నిర్ణయించిన రేట్ల ప్రకారం వసూలు చేయాలని సూచించారు.మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నిర్ణయించిన రవాణా ఛార్జీల జాబితాకు అనుగుణంగానే వసూళ్లు చేపట్టాలని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) ఆర్థిక నష్టం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందన్నారు.ఎరువుల విక్రయానికి, రవాణా ఛార్జీల వసూళ్లకు వేర్వేరు రసీదు పుస్తకాలు నిర్వహించాలని, రైతుల సంతకాలతో ప్రత్యేక రసీదులు తప్పనిసరిగా జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రతి పీఏసీఎస్ కార్యాలయం, ఎరువుల విక్రయ కేంద్రంలో రవాణా ఛార్జీల వివరాలను ప్రత్యేక బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. అలాగే పీఏసీఎస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, ప్రాథమిక సభ్యులు, రైతులకు రవాణా ఛార్జీలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.రవాణా ఛార్జీల వసూళ్లలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రతి లావాదేవీకి తప్పని సరిగా రసీదు ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు.కంపెనీల నుంచి నేరుగా ఎఫ్ ఓఎల్ విధానంలో సరఫరా అయ్యే ఎరువులకు ఎలాంటి రవాణా ఛార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు.ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీ తనం పెంపొందించేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. రైతులు ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకుని సహకరించాలని, ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీలను మాత్రమే చెల్లించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు మొత్తాలు చెల్లించవద్దని సూచించారు. ఏవైనా అక్రమ వసూళ్లు జరిగినట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేయరాదని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, విక్రయ సిబ్బంది తప్పని సరిగా అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## మెగా పిటిఎంలో తల్లిదండ్రులు ఇద్దరూ పాల్గొనండి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ (మెగా పి.టి.ఎం) 4.0లో తల్లిదండ్రులు ఇద్దరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలో 1,048 పాఠశాలలు, ఐదు ప్రభుత్వ కళాశాలల్లో మెగా పి.టి.ఎం 4.0 నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పాఠశాలలు, కళాశాలల్లో దాదాపు 92 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరూ పాల్గొని తమ కుమారుడు లేదా కుమార్తె విద్యా ప్రమాణాలు తెలుసుకోవాలని కోరారు. పాఠశాలను ఒకసారి సందర్శించడం వలన విద్యార్థులకు ఆత్మవిశ్వాసం కలుగుతుందని, పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు – తల్లిదండ్రులు కలుసుకోవడం గొప్ప సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. పాఠశాలలో గల మౌలిక సదుపాయాలు తెలుస్తుందని, ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన స్థాయి తెలియజేస్తారని, మెరుగుపరచుటకు తీసుకోవలసిన చర్యలు చర్చించవచ్చని తెలిపారు. మెగా పి.టి.ఎం ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. తల్లిదండ్రులకు కూడా ఆటల పోటీలు, భోజన ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఒక రోజు "మీ బిడ్డ చదివే పాఠశాలను సందర్శించండి – వారి విద్యా ప్రమాణాలు మెరుగుకు" తోడ్పడండి అని పిలుపునిచ్చారు.

**లీప్ యాప్ డౌన్ లోడ్ చేయండి**

లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ (LEAP) యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. యాప్ ఆధారంగా విద్యార్థి అభ్యసన స్థాయి తెలుసుకోవచ్చని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి



○ **జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో జల్ జీవన్ మిషన్ (JJM) పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రతి గ్రామీణ కుటుంబానికి సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, పైప్‌లైన్ నిర్మాణం, గృహ కనెక్షన్లు, నీటి సరఫరా వ్యవస్థల నిర్వహణ, పెండింగ్ పనులపై జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జె సి మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరఫరా చేసే తాగునీరు నాణ్యంగా ఉండేలా వాటర్ క్వాలిటీ టెస్టింగ్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. నీటి నమూనాలను నిర్దిష్ట వ్యవధిలో పరీక్షించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని తెలిపారు. ఎక్కడైనా నీటి నాణ్యతలో లోపాలు గుర్తించిన వెంటనే సత్వర చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న జాయింట్ కలెక్టర్, జల్ జీవన్ మిషన్ పనుల్లో నాణ్యతతో పాటు వేగానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ ఈ కళ్యాణ్ చక్రవర్తి, జెడ్పి సి ఈ ఒ జ్యోతి బసు, డి పి ఒ సాయి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిసి చైతన్య సమితి సమావేశంను జయప్రదం చేయండి



○ **బిసిలు అందరూ ఏకం కావాలి**

**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** జాతీయ బిసి చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బిసి రమణ ఆధ్వర్యంలో జరుగుతున్న బిసి చైతన్య సమితి కమిటీ ఏర్పాటుకు జరుగుతున్న సమావేశంలో బ్రహ్మంగారిమఠం మండలంలోని బిసి కులాల నాయకులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని బిసి పెద్దలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ ఆదివారం బ్రహ్మంగారిమఠంలోని పత్రా నాయుళ్ల కళ్యాణ మండపంలో ఉదయం 9.15 గం.. లకు సమావేశం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో బ్రహ్మంగారిమఠం చైతన్య సమితి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు బీసీ రమణ మరియు జిల్లా నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు. కాబట్టి బ్రహ్మంగారిమఠం మండలంలోని అన్ని బిసి కులాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని వారు కోరారు.

## బడివైపు ఒక అడుగు వేద్దాం ..



○ **కాకుమాను మండల విద్యాశాఖ**

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** బడివైపు ఒక అడుగు వేద్దాం మన పిల్లల ప్రగతిని చర్చిద్దాం అని కాకుమాను మండల విద్యాశాఖ అధికారులు కె. యఫ్ కెనడి కె . విజయ బాన్కర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మరియు గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు ప్రకారము ది 24.7.2026 న మండల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే జరపాలని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పనిసరిగా తల్లిదండ్రులు పాఠశాలలో జరుగు మెగా పేరెంట్స్ డే లో పాల్గొని పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అభివృద్ధిలో పరస్పరం టీచర్స్ తో చర్చించుకోవాలని వారు పిలుపునిచ్చారు. మరియు వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి దోహదపడిన దాతలు కూడా ఈ కార్యక్రమంలో పాలు పొందవలసిందిగా కోరారు.

## ఇక అభివృద్ధికి చిరునామా అలీనగర్ : ఎమ్మెల్యే నసీర్

○ **ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వ పాలన**

○ **అన్ని ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు**

○ **తల్లికి వందనంతో ప్రతి ఇంటా సంతోషాలు**

○ **మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

○ **రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటా చదువుల పంటగా మారిందని, తల్లికి వందనం అందుకున్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక అలీనగర్, సాయినగర్, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో రూ. 1.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల ఆలోచన మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని డివిజన్లలో అభివృద్ధితోపాటు శానిటేషన్ పైనా దృష్టి సారించామని చెప్పారు. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులతో కలిసి పర్యటిస్తున్నామని, ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు ఉన్న ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందన్నారు. తల్లికి వందనం నిధులు జమ కావడంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు బెంగ లేకుండాపోయిందని తెలిపారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నారని చెప్పారు. నేడు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారని, దీని ద్వారా విద్యార్థుల సామర్థ్యాల మదింపు సాధ్యమవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా పునాదులు వేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమం పేరిట దోచుకో–దాచుకో చందాన వ్యవహరించారని విమర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా పాఠశాలల్లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే తనను సంప్రదించాలని సూచించారు.

## క్రీడాశాఖ మంత్రిని కలిసిన జ్యోతి సురేఖ వెన్నం

○ **వరల్డ్ కప్ విజయాలకు మంత్రి అభినందనలు**



**అమరావతి, జూలై 23 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం గురువారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వరల్డ్ కప్‌లో సాధించిన పతకాల విశేషాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆమె వెంట తండ్రి కూడా ఉన్నారు.

జ్యోతి సురేఖ వెన్నం అంతర్జాతీయ స్థాయిలో సాధిస్తున్న విజయాలను మంత్రి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మరింత పేరు తీసుకురావడంతో పాటు యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం అండగా ఉంటుంది: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

○ **దివ్యాంగ చిన్నారులకు ఆధునిక సహాయక పరికరాల పంపిణీ**



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో సమగ్ర శిక్ష "సహిత విద్య" విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగ బాలబాలికలకు వివిధ రకాల ఆధునిక సహాయక పరికరాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, బ్రెయిలీ కిట్లు, వాకర్లు, ఆధునిక బ్యాటరీతో పనిచేసే ఈ–వీల్ చైర్లను లబ్ధిదారులకు స్వయంగా అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో మమేకమై వారిని చదువులోనూ, జీవితంలోనూ ధైర్యంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు.

అనంతరం నిర్వహించిన సభలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, దివ్యాంగ పిల్లలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం సమర్థులుగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన సహాయక పరికరాలను అందజేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఈ–వీల్ చైర్లు బ్యాటరీతో పనిచేస్తాయని, ఒకసారి ఛార్జింగ్ చేస్తే కేవలం స్విచ్ నొక్కడం ద్వారా ఎలాంటి సహాయం లేకుండానే వారు తమకు కావలసిన చోటుకు సులభంగా వెళ్లగలరని వివరించారు.

దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, రవాణా వంటి అన్ని రంగాల్లో దివ్యాంగులకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇంకా అర్హత కలిగిన దివ్యాంగులు ఎవరైనా ఈ తరహా సహాయక పరికరాలు పొందకుండా ఉంటే తమ ఆధార్ కార్డు, సదరం ధ్రువీకరణ పత్రాలతో వినుకొండలోని శివశక్తి థియేటర్ సమీపంలో ఉన్న తమ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బాధితురాలి ప్రకటనతోనైనా వైసీపీ నేతలు దుష్ప్రచారం మానుకోవాలి

○ **ఎమ్మెల్యే గల్లా మాధవి బాధితురాలికి అండగా నిలిచారని స్పష్టం**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కృష్ణబాబు కాలనీలో మహిళపై జరిగిన ఘటన విషయంలో ఎమ్మెల్యే గల్లా మాధవిపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను తెలుగు మహిళ నాయకులు తీవ్రంగా ఖండించారు. బాధిత మహిళ స్వయంగా ఎమ్మెల్యే తనకు అండగా నిలిచారని వెల్లడించిన తర్వాత కూడా దుష్ప్రచారం కొనసాగించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీఐపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. బాధితురాలికి న్యాయం చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందని పేర్కొన్నారు. బాధిత మహిళ స్వయంగా విడుదల చేసిన వీడియోలో ఎమ్మెల్యే గల్లా మాధవి తనకు అక్కలా అండగా నిలిచారని, తరచూ ఫోన్ చేసి పరామర్శించడంతో పాటు ధైర్యం చెప్పారని వెల్లడించిందన్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. బాధితురాలు జరిగిన ఘటన నుంచి కోలుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆమెకు సంబంధించిన వీడియోలను పదేపదే ప్రచారం చేస్తూ మానసిక వేదనకు గురిచేయడం అనైతికమని తెలుగు మహిళ నాయకులు పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం తగదని, బాధితురాలి ప్రకటనతోనైనా వైసీపీ నేతలు దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని హెచ్చరించారు.

ఈ సమావేశంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పంచుమర్తి కల్పన, యార్డు డైరెక్టర్ విజయలక్ష్మి, పార్లమెంట్ పార్టీ కార్యదర్శి గంటా మౌళిక, చెంబేటి మణికుమారి, మీనాక్షి, జీవని, లక్ష్మీ జానకి, భాగ్యలక్ష్మితో పాటు నాయకులు పాల్గొన్నారు.

## జూలై 31న రాష్ట్రవ్యాప్తంగా 'జర్నలిస్టుల డిమాండ్స్ డే'

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 31వ తేదీన 'జర్నలిస్టుల డిమాండ్స్ డే' నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏ పి డబ్ల్యు జె ఎఫ్ ) రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం గుంటూరులో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టులకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై విస్తృతంగా చర్చించినట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి పులివర్తి హరీష్, జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి పులివర్తి హరీష్ మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నప్పటికీ, వారి సంక్షేమానికి సంబంధించిన అనేక సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలం కేటాయించడం, పెన్షన్ సదుపాయం కల్పించడం, ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించడం వంటి డిమాండ్లు అత్యంత ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 11 ప్రధాన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ, జూలై 31న నిర్వహించే 'జర్నలిస్టుల డిమాండ్స్ డే' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి వి. రామాంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి డిమాండ్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జూలై 31న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడంతో పాటు అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సంబంధిత మంత్రులను కలిసి 11 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర కార్యవర్గం సమర్పించనున్నట్లు నాయకులు తెలిపారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బోస్కొ సువర్ణ బాబు, ప్రధాన కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని, రాష్ట్రంలోని ప్రతి జర్నలిస్టు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఖాళీ స్థలాల శుభ్రతకు శ్రీకారం



○ **పశ్చిమలో ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిన ఎమ్మెల్యే గల్లా మాధవి**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజారోగ్యం, భద్రత లక్ష్యంగా ఖాళీ స్థలాల శుభ్రత కార్యక్రమానికి ఎమ్మెల్యే గల్లా మాధవి శ్రీకారం చుట్టారు. జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు 25వ డివిజన్ సీతారామనగర్–ఆదర్శనగర్ రోడ్డులో కార్యక్రమాన్ని ప్రారంభించి పనులను పరిశీలించారు. గత రెండేళ్లుగా అసెంబ్లీతో పాటు జీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో ఖాళీ స్థలాల సమస్యను నిరంతరం ప్రస్తావించడంతో ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రారంభమైందన్నారు. వర్షాకాలంలో ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు, విషసర్పాలు, క్రిమికీటకాలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడటమే కాకుండా, అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 5,500 ఖాళీ స్థలాలను గుర్తించామని, యజమానులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎంసీ ఆధ్వర్యంలో శుభ్రపరిచే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం నిబంధనల ప్రకారం ఖర్చులను సంబంధిత యజమానుల నుంచే వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

ఖాళీ స్థలాల యజమానులు భూములను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆదర్శనగర్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఒక్క డివిజన్‌కే పరిమితం కాదని, "పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ఖాళీ స్థలాలు శుభ్రం అయ్యే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది" అని గల్లా మాధవి స్పష్టం చేశారు.

## మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేద్దాం



○ **జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఖాసీం వలి**

**పోరుమామిళ్ల (జర్నలిస్ట్ ఫైల్ )** నేడు జరగనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 3.1 ను విజయవంతం చేయాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసీంవలి పిలుపునిచ్చారు. బుధవారం కాశినాయన మండలం లోని బాలాయపల్లె నందు ప్రధానోపాధ్యాయులు పల్లా. దస్తగిరి బాబు ఖాసీంవల్లి లు గ్రామం లో తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కి రావాలని ఆహ్వాన పత్రికలు ఇచ్చి ఆహ్వానించారు. ఖాసీం వల్లి మాట్లాడుతూ. పిల్లల విద్యాభివృద్ధి కోసం తల్లిదండ్రులు బడి వైపు అడుగులు వేసి వారి ఉజ్వల భవిష్యత్తు కు అమూల్య మైన సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. మీటింగ్ కి హాజరయ్యే తల్లిదండ్రులకు మధ్యాహ్నం రుచికరమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి



○ **జులై 24న విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి ఎస్ఎఫ్ఐ - డివైఎఫ్ఐ**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ )**

దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన నీట్ పేపర్ లీకేజ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జులై 24న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ చేయాలని బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద విలేఖల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీకేజీలో దేశ విద్య వ్యవస్థ పై విద్యార్థులలో తీవ్ర ఆందోళనను కలిగించాయని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

నీట్ పరీక్షల అవకతవకాలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే జోక్యం చేసుకొని స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 24న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్ ను విద్యాసంస్థల యాజమాన్యాలు సంపూర్ణ మద్దతు తెలిపి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సోమిరెడ్డిపల్లి అ–రవింద్ ఉపాధ్యక్షులు సంగటి దేవకుమార్, నాయకులు సిద్దు లు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం



- మంత్రివర్గ నిర్ణయంపై సత్యకుమార్ హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని నేతన్న కుటుంబాలకు భరోసా కల్పించేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 52 వేల చేనేత కుటుంబాలకు ఏటా రూ. 25 వేల ఆర్థిక సాయం అందించాలని మంత్రివర్గం నిర్ణయించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఇప్పటికే చేనేత రంగానికి ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం, అదనంగా ప్రతి కుటుంబానికి వార్షిక ఆర్థిక సాయం ప్రకటించడం నేతన్నల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి అన్నారు. ఈ నిర్ణయం చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో కీలకంగా మారుతుందని తెలిపారు. చేనేత రంగ పరిరక్షణ, నేతన్నల జీవనోపాధి బలోపేతానికి కట్టుబడి పనిచేస్తున్న ఎన్డీయే ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## వారం రోజుల్లో భూ సమీకరణ ప్రగతి సాధించాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** సి.ఆర్.డి.ఏ రెండవ విడత భూ సమీకరణ వారం రోజుల్లో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సి.ఆర్.డి.ఏ భూ సమీకరణపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నోటిఫై చేసిన భూముల సమీకరణ ఆవశ్యమని అందుకు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. పెద్దపరిమి, హరిశ్చంద్రాపురం, వడ్డమాను గ్రామాల్లో అవగాహన త్వరితగతిన చేపట్టాలని స్పష్టం చేశారు. భూసమీకరణకు డిప్యూట్ చేసిన సర్వేయర్ లు వెంటనే చేరాలని ఆదేశించారు. రికార్డు ప్రకారం భూమి వివరాలు, భౌతికంగా ఉన్న భూమి వివరాలు సరిపోతే సమీకరణ చేయవచ్చని అన్నారు. రికార్డు ప్రకారం ఉన్న భూమి కంటే ఎక్కువ భూమిని ఎవరు క్లెయిమ్ చేయలేరని స్పష్టం చేశారు. డాక్యుమెంట్ లో చూపిన భూమిని రైతు విధిగా చూపించాలని అన్నారు.

సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ భూ సమీకరణ జరగాల్సిన వివరాలు తెలిపారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, సి.ఆర్.డి.ఏ డిప్యూటీ కలెక్టర్ లు, సంబంధిత మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి బీజేపీ వినతి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని కొత్తపేట 14వ వార్డు గణేష్‌రావు పేటలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు నగర పాలక సంస్థ అధికారులను కోరారు.

ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు బీజేపీ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మున్సిపల్ అధికారులను అక్కడికే పిలిపించి సమస్యను వివరించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం స్థానిక ప్రజల నుంచి సంతకాలు సేకరించి, సమస్యల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్‌కు అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేసు సత్యనారాయణ, ఓబీసీ పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మోతే శేషగిరి, సీనియర్ నాయకుడు పోతురాజు వెంకట్, ఓబీసీ జిల్లా కోశాధికారి కసినబోయిన శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి

- జూలై 30న 'ఛలో కలెక్టరేట్'ను జయప్రదం చేయాలని పిలుపు

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని వివిధ రంగాల్లో ప్రైవేటు యాజమాన్యాల వద్ద పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ జూలై 30న నిర్వహించనున్న 'ఛలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే. హనుమంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ వైద్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి మాట్లాడుతూ రాష్ట్రంలోని 71 షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు వెంటనే కనీస వేతనాలను రూ. 26 వేలుగా పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.

అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు, సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, 108, 104, ఆరోగ్య మిత్ర, అర్బన్ హెల్త్, ఆయుష్, తల్లి–బిడ్డ తదితర పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఆప్కాస్, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు.

జూలై 30న జరిగే 'ఛలో కలెక్టరేట్' కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఫార్మసిస్ట్ జ్యోతిర్మయి, ల్యాబ్ టెక్నీషియన్ కోటేశ్వరరావు, రోజా, ఎక్స్‌రే టెక్నీషియన్ సాంబశివరావు, స్టాఫ్ నర్స్ సోమమ్మ, ఫిజియోథెరపిస్టు బాలకృష్ణ, జీడీఏ శ్రీకాంత్, ఆస్పత్రి సిబ్బంది, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# సిజేరియన్లన్నీ ఇక ఆడిట్ పరిధిలోకి




- వైద్య అవసరముంటేనే.. సిజేరియన్ చేయాలి
- ప్రతి కేసుకూ కారణాలు.. పూర్తి రికార్డులు తప్పనిసరి
- నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నిర్వహించే సిజేరియన్ ప్రసవాలు ఇకపై ఆడిట్ పరిధిలోకి రానున్నాయి. వైద్యపరంగా అవసరమైన సందర్భాల్లోనే సిజేరియన్ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి కేసులో సిజేరియన్ చేయాల్సిన అవసరాన్ని సమర్థించే వైద్య కారణాలు, పరీక్షల నివేదికలు, ఇతర ఆధారాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించింది.

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు పరిధిలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాల సంఖ్య అధికంగా ఉంటోందని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఈ అంశంపై వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. వైద్యపరమైన అవసరం లేకుండా సిజేరియన్లు నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చక్రధర్‌బాబు అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులకు సర్క్యులర్ జారీ చేశారు. తాజా ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని ఆస్పత్రుల యాజమాన్యాలకు స్పష్టంచేశారు.

**సిజేరియనుకు దారితీసిన కారణాలపై నమోదు జరగాలి**

తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని వైద్యపరంగా అవసరమని నిర్ధారించినప్పుడే సిజేరియన్ ప్రసవం నిర్వహించాలి. నిర్దేశిత వైద్య విధానాలు, ప్రామాణిక చికిత్స మార్గదర్శకాలు, చట్టబద్ధ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ప్రతి సిజేరియన్ కు దారితీసిన వైద్య పరిస్థితులను స్పష్టంగా నమోదు చేయాలి. వైద్యుల పరిశీలనలు, పరీక్షల ఫలితాలు, చికిత్స వివరాలు, సిజేరియన్‌ను సమర్థించే ఇతర రికార్డులను ఆసుపత్రుల్లో భద్రపరచాలి.

**చర్యలు తప్పవు**

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద నిర్వహించే సిజేరియన్ కేసులను వైద్యసేవ ట్రస్ట్ లేదా సంబంధిత అధీకృత అధికారి ఆడిట్ చేస్తారు. వైద్యపరమైన కారణాలు సరిగా నమోదు చేయకపోయినా, అవసరమైన రికార్డులు లేకపోయినా, నిర్దేశిత మార్గదర్శకాలను ఉల్లంఘించినా తీవ్రంగా పరిగణిస్తారు. నిబంధనలను పాటించని ఆసుపత్రులపై ఎంపానెల్‌మెంట్ ఒప్పందంలోని నిబంధనలు, షరతుల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ట్రస్ట్ సీఈఓ హెచ్చరించారు.

**ప్రతి రోగికీ డిజిటల్ ఆరోగ్య రికార్డు**

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఏదైనా వైద్య ప్రక్రియలో చేపట్టే ముందు అర్హత కలిగిన ప్రతి రోగికి ఆభా గుర్తింపు సంఖ్యను రూపొందించాలి. రోగికి సంబంధించిన ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డును తప్పనిసరిగా నిర్వహించాలి. ఆభా గుర్తింపు సంఖ్య, ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డు రూపొందించకుండా పథకం కింద ఎలాంటి వైద్య ప్రక్రియనూ చేపట్టరాదని ట్రస్ట్ తేల్చిచెప్పింది.

**వైద్యుల పేర్ల నమోదు**

రోగుల చికిత్సలో పాల్గొనే వైద్యులు, ఇతర ఆరోగ్య వృత్తి నిపుణులందరూ ఆరోగ్య వృత్తి నిపుణుల రిజిస్ట్రీలో నమోదై ఉండేలా నెట్‌వర్క్ ఆసుపత్రులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నిబంధనలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పేర్కొంది.

## ఖాళీ స్థలాల పరిశుభ్రతపై జీఎంసీ ప్రత్యేక కార్యాచరణ

- నిర్లక్ష్యం వహించిన స్థల యజమానులకు భారీ జరిమానాలు
- అవసరమైతే జీఎంసీయే శుభ్రపరచి ఖర్చు వసూలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుద్ధ్య మెరుగుదల లక్ష్యంగా గుంటూరు నగర పాలక సంస్థ ఖాళీ స్థలాల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు పెరగడం, చెత్త పేరుకుపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు, ఈగలు, పందులు చేరి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యలు ప్రారంభించినట్లు నగర కమిషనర్ మయూర్ అశోక్ తెలిపారు.

ఖాళీ స్థలాల యజమానులు తమ ప్లాట్లకు తప్పనిసరిగా కాంపౌండ్ వాల్ లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, పిచ్చి మొక్కలు తొలగించి, వర్షపు నీరు నిల్వ కాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఖాళీ స్థలాలను చెత్త డంపింగ్ యార్డులుగా మార్చడం, భవన నిర్మాణ వ్యర్థాలను పారవేయడం వంటి చర్యలపై ప్రజారోగ్య విభాగం ప్రత్యేక నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్లాట్లను పరిశుభ్రంగా నిర్వహించకుండా ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే స్థల యజమానులపై ప్రత్యేక యాప్ ద్వారా భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. హెచ్చరికల అనంతరం కూడా స్పందించని యజమానుల స్థలాలను జీఎంసీ సిబ్బందితో శుభ్రం చేయించి, అందుకు అయ్యే వ్యయాన్ని జరిమానాతో కలిపి సంబంధిత ఆస్తి పన్ను ఖాతాకు జమ చేసి వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజల ఆరోగ్య రక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఖాళీ స్థలాల యజమానులు వెంటనే స్పందించి ప్లాట్లను శుభ్రపరచాలని, స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన గుంటూరు నిర్మాణానికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ వైఖరిపై బీజేపీ తీవ్ర విమర్శలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా రాజకీయాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం గుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఢిల్లీలో కొన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలతో కలిసి కాంగ్రెస్ తెరవెనుక రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. దేశంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని కోరారు.

నీట్ పరీక్షకు సంబంధించి అవకతవకలు వెలుగుచూసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం ద్వారా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడిందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కొందరు దేశ వ్యతిరేక శక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని ప్రయత్నించాయని ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు పేర్కొన్న పలు అవినీతి కేసులు, గతంలో మెడికల్ ప్రవేశ పరీక్షల్లో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన పేపర్ లీకేజీ ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేసిన దర్శనపు శ్రీనివాస్, దేశ వ్యతిరేక కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్టు తాడువాయి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధారా అంబేద్కర్, పోతురాజు వెంకట్, షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిగుబ్బ-కదిరి నాలుగు లేన్ల రహదారికి రూ.679.71 కోట్లు

- మంత్రి సత్యకుమార్ చొరవతో కేంద్రం ఆమోదం.. ధర్మవరం అభివృద్ధికి మరో కీలక అడుగు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ–కదిరి మధ్య జాతీయ రహదారి–42ను నాలుగు లేన్లుగా విస్తరించి బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 679.71 కోట్లను మంజూరు చేసింది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ ప్రాజెక్టు ఆమోదానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ముదిగుబ్బ--కదిరి రహదారి విస్తరణ ప్రతిపాదనను వేగవంతం చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పాటు సంబంధిత ఉన్నతాధికారులతో పలుమార్లు సమావేశమై ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసిన ఫలితంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో సుమారు 70 శాతం ధర్మవరం నియోజకవర్గ పరిధిలోనే చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందిస్తూ, ఈ ప్రాజెక్టు ధర్మవరం నియోజకవర్గంతో పాటు శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న జాతీయ రహదారిని పేవ్డ్ షోల్డర్లతో కూడిన నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ముదిగుబ్బ ప్రాంతానికి మెరుగైన రహదారి అనుసంధానం లభించడంతో పాటు బెంగళూరు–విజయవాడ–కోల్‌కతా (బీకేవీ) ఎక్స్‌ప్రెస్‌వే, తిరుపతి, చెన్నై నగరాలకు వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు కూడా అనుసంధానం మరింత మెరుగుపడనుంది.

ఈ ప్రాజెక్టుతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు సరుకు రవాణా సులభతరం కానుంది. ట్రాఫిక్ రద్దీ తగ్గి, ముదిగుబ్బ పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం, వ్యాపారం, పారిశ్రామిక రంగాలకు ఊతం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టులో భాగంగా నాలుగు లేన్ల ప్రధాన రహదారితో పాటు సర్వీస్ రోడ్లు, ఒక ఫ్లైఓవర్, ఒక వాహన అండర్‌పాస్–కమ్–రోడ్ ఓవర్‌బ్రిడ్జి, ఒక ప్రధాన వంతెనను నిర్మించనున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రహదారి విస్తరణతో పరిశ్రమలు, వ్యాపారాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడి ముదిగుబ్బ ప్రాంతం ఆర్థికంగా మరింత పురోగతి సాధించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

## బీజేపీ నేత నెట్టం రామకృష్ణబాబుకు ఘన నివాళులు



**జగ్గయ్యపేట (జర్నలిస్ట్ ఫైల్):** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ పూర్వ కన్వీనర్ స్వర్గీయ నెట్టం రామకృష్ణబాబు పెద్దకర్మ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొని నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు రామినేని వెంకటకృష్ణ, సగ్గుర్తి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా పూర్వ అధ్యక్షుడు బబ్బూరి శ్రీరామ్, ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేగళ్ల రఘునాధరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ టి.ఎస్. బాబు, వత్సవాయి మండల పూర్వ అధ్యక్షుడు పాపినేని వీరబాబు, ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బొడ్డు మల్లికార్జునరావు, ఎన్టీఆర్ జిల్లా పూర్వ కార్యదర్శి బోనం రామిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, బుర్రా వెంకటరావు, చింతల గోపాలరావు, తక్కెళ్లపాటి రామారావుతో పాటు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

నెట్టం రామకృష్ణబాబు పార్టీ అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణను పునఃసమీక్షించాలి

- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సరైన నోటిఫికేషన్, రిజర్వేషన్ విధానం, రోస్టర్ వ్యవస్థతో పాటు ఇతర చట్టబద్ధ నియామక నిబంధనలు పాటించకుండా నియమితులైన కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించే ప్రతిపాదనను ప్రభుత్వం పునఃసమీక్షించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) కోరింది.

ఈ మేరకు ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ రాజ్యాంగ నిబంధనలు, సేవా నియమాలు, రిజర్వేషన్ విధానం, రోస్టర్ వ్యవస్థ, పారదర్శక ఎంపిక ప్రక్రియ ప్రకారమే జరగాలని వారు పేర్కొన్నారు. ఈ ప్రాథమిక నియామక సూత్రాలను విస్మరించి చేపట్టే క్రమబద్ధీకరణ చర్యలు సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, అర్హులైన అభ్యర్థుల రాజ్యాంగబద్ధ హక్కులను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇలాంటి చర్యలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 16 స్ఫూర్తికి విరుద్ధంగా ఉండటమే కాకుండా, అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను హరించే ప్రమాదం ఉందన్నారు. అలాగే పదోన్నతికి అర్హులైన ఉపాధ్యాయుల చట్టబద్ధ హక్కులపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ అంశాన్ని ప్రభుత్వం పునఃసమీక్షించి, రాజ్యాంగ విలువలు, సమాన అవకాశాలు, రిజర్వేషన్ విధానం, సామాజిక న్యాయ సూత్రాలను పరిరక్షించే విధంగా నిర్ణయం తీసుకోవాలని ఎన్‌టీఏ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# కార్గిల్ అమరవీరుల త్యాగాలు దేశానికి స్ఫూర్తి : బీజేపీ

- విశాఖలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నివాళి



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, అంకితభావం, దేశభక్తి ప్రతి భారతీయుడికి చిరస్మరణీయమైన స్ఫూర్తిగా నిలుస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. గురువారం విశాఖపట్నంలో భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, భారత మాత కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీర జవాన్లకు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, 1999లో కార్గిల్ యుద్ధంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులను ఎదుర్కొంటూ భారత సైనికులు సాధించిన విజయం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీర జవాన్ల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని చెప్పారు. నేడు భారతదేశం సురక్షితంగా, స్వేచ్ఛగా, గర్వంగా నిలబడటానికి సాయుధ దళాల అపార త్యాగాలు, నిరంతర అప్రమత్తతే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వర్తిస్తున్న జవాన్ల సేవలు ప్రతి భారతీయుడిలో దేశభక్తిని మరింత పెంపొందిస్తాయని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ రక్షణ వ్యవస్థ మరింత బలోపేతమైందని, సైనిక దళాలకు ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు అందించడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మాధవ్ తెలిపారు. దేశ భద్రత విషయంలో రాజీ అనే మాటకు తావులేదని, సాయుధ దళాల సంక్షేమం కేంద్ర ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. యువత దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ భావనను అలవర్చుకొని దేశ అభివృద్ధి, రక్షణలో తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్గిల్ అమరవీరుల త్యాగాలను ప్రతి తరం గుర్తుంచుకుని వారి ఆదర్శాలను అనుసరించాలని కోరారు.

కార్యక్రమంలో బీజేపీ, భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులు, మాజీ సైనికులు, పార్టీ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళు లర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467